ఎంఈడీ, ఎంపీఈడీ సీట్ల చివరి దశ భర్తీకి షెడ్యూల్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 29: రాష్ట్రవ్యాప్తంగా ఎంఈడీ, ఎంపీఈడీ సీట్ల చివరి దశ భర్తీకి షెడ్యూల్ విడుదల చేసినట్లు టీజీ సీపీజీ ఈటీ-2024 కన్వీనర్ ప్రొఫెసర్ ఐ.పాండురంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు అభ్యర్థులు వచ్చే నెల 2వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. వచ్చే నెల 3వ తేదీన వెరిఫికేషన్ వివరాలను వెల్లడిస్తామన్నారు. 3, 4 తేదీల్లో వెబ్‌ఆప్షన్లను ఎంపిక చేసుకోవాలని, 4వ తేదీన ఎడిట్ చేసుకోవచ్చన్నారు. ప్రాథమిక సీట్ల కేటాయింపు జాబితాను 5వ తేదీన విడుదల చేస్తామని, అభ్యర్థులు తమకు కేటాయించిన కళాశాలలో 9వ తేదీలోగా రిపోర్టు చేయాల్సి ఉంటుందని వివరించారు. ఇతర వివరాలకు అభ్యర్థులు తమ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

డిగ్రీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 29: ఓయూ పరిధిలోని వివిధ డిగ్రీ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీకామ్ హానర్స్, బీఎస్సీ, బీఎస్సీ హానర్స్, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 11వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

నేడు దివ్యాంగుల మహాధర్నా

చిక్కడపల్లి, నవంబర్ 29: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన దివ్యాంగుల పింఛన్‌ను రూ.6000 పెంచాలని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఇందిపార్క్ ధర్నాచౌక్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్టు డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్(డీఎస్‌డీ) రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో దివ్యాంగులకు అనేక హామీలు ఇచ్చినా ఏ ఒక్కటీ అమలు చేయాలేదని మండిపడ్డారు. ధర్నాకు రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో దివ్యాంగులకు హాజరు అవుతారని తెలిపారు.

ప్రత్యేక రాష్ట్రం సాకారం చేసిన నేత

బీఆర్ఎస్ నాయకులు నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్న తలసాని శ్రీనివాస్

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ● ఘనంగా దీక్షా దివస్ వేడుకలు

బేగంపేట్: ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కలను సాకారం చేసిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం బేగంపేట్ పాటిగడ్డ నుంచి తెలంగాణ భవన్ వరకు సాగే భారీ బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ర్యాలీలో 3 వేల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. 5కిలోమీటర్ల వరకు తలసాని బైక్ నడుపుతు ర్యాలీలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధనే లక్ష్యంగా కేసీఆర్ 2001లో టీఆర్ఎస్ స్థాపించి అనేక పోరాటాలు, ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. తెలంగాణ వచ్చుడో-కేసీఆర్ సచ్చుడో అనే నినాదంతో ఆమరణ నిరహార దీక్ష చేపట్టారన్నారు. దీక్షతో ఉద్యమం కీలక మలుపు తిరిగిందన్నారు. ర్యాలీలో పార్టీ రాష్ట్ర యువ నాయకులు తలసాని సాయికిరణ్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు, అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, ఆకుల హరికృష్ణ, కొలన్ బాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి మల్లికార్జునగౌడ్. హన్మంతరావు, గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్

మారేడ్‌పల్లి, నవంబర్ 29: తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా మలిదశ ఉద్యమానికి ఊపిరి పోసి, ఢిల్లీ పెద్దలను గడగడలాడించిన తెలంగాణ సాధకుడు రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ అని రాష్ట్ర బేవరెజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్ అన్నారు. దీక్షా దివస్‌ను పురస్కరించుకొని కార్ఖానలోని ఆర్కే ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో నాగేశ్ వృద్ధులకు భోజనం, ఉచితంగా మందులు, వైద్య పరికరాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో.. అనే నినాదంతో 2009 నవంబర్ 29న ఉద్యమ సారథి, స్వరాష్ట్ర సాధకుడు కేసీఆర్ దీక్ష చేశారని అన్నారు. ఆనాడు సమైక్య పాలకులపై కేసీఆర్ కఠోర దీక్ష, పట్టుదలతో ఉద్యమం నడిపించారన్నారు. కంటోన్మెంట్ డైయిమండ్ పాయింట్ నుంచి తెలంగాణ భవన్ వరకు నాగేశ్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ కొనసాగింది. నాయకులు జంగిలి రాజు, రావుల సతీశ్, శ్రీనివాస్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు. కంటోన్మెంట్ నాలుగో వార్డులో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏఎల్ ఆనంద్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శత్రు, శేఖర్, రాజేశ్, ఝాన్సీ, రోషన్ పాల్గొన్నారు.

కార్ఖానలో వృద్ధులకు భోజనం అందజేస్తున్న బీఆర్ఎస్ నేత గజ్జెల నాగేశ్

మలిదశ ఉద్యమానికి ఊపిరి పోసిన ధీరుడు

అంబేద్కర్ హాట్స్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నేత మన్నె క్రిషాంక్

కంటోన్మెంట్, నవంబర్ 29: మలిదశ ఉద్యమాన్ని మలుపు తిప్పి, ఉద్యమ చరిత్రపై చెరిగిపోని సంతకం చేసిన మహా నేత, తెలంగాణ సాధకుడు కేసీఆర్ అని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ మన్నె క్రిషాంక్ అన్నారు. 'తెలంగాణ రాష్ట్రం వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అని ప్రకటించి ఆమరణ దీక్షకు దిగి నేటికి 15 ఏళ్లు పూర్తయిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దీక్ష దివస్‌ను పురస్కరించుకుని శుక్రవారం కంటోన్మెంట్‌లోని అంబేద్కర్ హాట్స్‌లో వృద్ధులకు క్రిషాంక్ దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు కేసీఆర్ పట్టుదలతో దీక్ష చేయకపోతే ఈనాడు మనం తెలంగాణను చూసే వాళ్లం కాదన్నారు. అటువంటి నేతను కొందరు కాంగ్రెస్ మూర్ఖులు ఆనవాళ్లు లేకుండా చేస్తామని అనడం సిగ్గు చేటన్నారు. 15 ఏళ్ల క్రితం చావు నోట్లో తల పెట్టిన కేసీఆర్.. శాంతియుత పద్ధతిలో తెలంగాణను సాధించారని జ్ఞప్తికి తెచ్చారు. అబద్ధాలతో ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎన్నికల హామీల అమలులో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో వెంకట్, సాంబ ఆశోక్, సంగప్ప, కనకసుందర్, గురువయ్య, సందీప్, అనిత, శోభ, సాయి, రాజు, మోని, రఘు, సాయి, ఫహీం, సంపత్, రిషీ తదితరులు పాల్గొన్నారు.

లష్కర్‌లో నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

బేగంపేట్, నవంబర్ 29: విద్యుత్ లైన్లలో తలెత్తిన సాంకేతిక లోపాలు, ట్రిమ్మింగ్ కారణంగా నేడు (శనివారం) సికింద్రాబాద్ ప్యారడైజ్ ఏఈడీ పరిధిలో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతు చేపడుతున్నట్టు ఎలక్ట్రిసిటీ అధికారులు తెలిపారు. లాలాగూడ, మోండా మార్కెట్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం విధిస్తున్నట్టు చెప్పారు. విజయపురి ఫీడర్ పరిధిలోని ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విజయపురి, చిల్డ్రన్స్ పార్కు రోడ్డు, ఓయూ క్వార్టర్స్, వాటర్‌వర్క్స్ పాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తారు. లాలాపేట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు వరకు వినోభానగర్, ఇందిరానగర్, లాలాపేట్, గణేశ్ టెంపుల్, ఇసుకబావి ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తారు. ధర్మకంట ఫీడర్ పరిధిలో మానస నర్సింగ్ హోమ్, టెలిఫోన్ భవన్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు కోత విధించనున్నట్టు తెలిపారు.

కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ ఆవిర్భావం


అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, నవంబర్ 29: కేసీఆర్ ప్రాణాలను ఫణంగా పెట్టి అమర నిరాహార దీక్షతో రాష్ట్రం ఆవిర్భవించిందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం రాంనగర్ చౌరస్తాలోని అమర వీరుల స్థూపానికి నివాళులర్పించి, తెలంగాణ భవన్‌కు ర్యాలీని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సమాజాన్ని ఏకతాటిపై తీసుకొచ్చిన నేత కేసీఆర్ అన్నారు. కేసీఆర్ మూలంగానే ప్రత్యేక రాష్ట్రం అవతరించిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ యూత్ విభాగం నేత ముఠా జయసింహ, డివిజన్ల అధ్యక్షులు బి.శ్రీనివాస్‌రెడ్డి, వై.శ్రీనివాస్, రాకేష్, శ్రీధర్‌రెడ్డి, శంకర్‌ముదిరాజ్, శ్యామ్‌యాదవ్, నాయకులు వి.సుధాకర్‌గుప్త, శ్యామ్‌సుందర్, నేత శ్రీనివాస్, రవి యాదవ్, బొట్టు శ్రీనివాస్, ఎయిర్‌టెల్ రాజు, సురేందర్, షరీపుద్దిన్, నీలాదేవి, తులసీ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ స్మృతులను గుర్తుచేసుకోవాలి

కేసీఆర్ తెచ్చిన పథకాలు దేశానికే ఆదర్శం

కంటోన్మెంట్ నుంచి ర్యాలీగా వెళుతున్న బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత, నేతలు

కంటోన్మెంట్, నవంబర్ 29: తెలంగాణ మలిదశ ఉద్యమ చరిత్ర స్మృతులను ప్రతిఒక్కరూ గుర్తుచేసుకోవాలని కంటోన్మెంట్ బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత అన్నారు. దీక్షా దివస్‌ను పురస్కరించుకుని బోర్డు పరిధిలోని పలు వార్డులలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, బోర్డు మాజీ సభ్యులు లోక్‌నాథం, పాండుయాదవ్, అనితాప్రభాకర్, నళినికిరణ్‌తో కలిసి ఆరో వార్డులోని ఇంపీరియల్ గార్డెన్ నుంచి భారీ ర్యాలీగా తెలంగాణ భవన్‌కు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ తలపెట్టిన దీక్షతోనే రాష్ట్రం అంతటా ఉద్యమ స్ఫూర్తి రగిలిందని అన్నారు. దీక్షతోకు బెదిరిపోయిన కేంద్రం డిసెంబర్ 9న ప్రత్యేక తెలంగాణను ప్రకటించిందని గుర్తుచేశారు. అంతకుముందు రెండో వార్డులో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ నేతృత్వంలో దీక్షా దివస్ ఘనంగా జరిగింది. కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ కలసాకారం అయ్యిందని, ఉద్యమం భావితరాలకు ఒక స్ఫూర్తిగా నిలుస్తుందని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లిలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి క్షీరాభిషేకం చేశారు.

దీక్షా దివస్‌కు భారీగా తరలిన శ్రేణులు

● బైక్ ర్యాలీలతో కిక్కిరిసిన రహదారులు ● భారీగా తరలిన గులాబీ శ్రేణులు, కార్యకర్తలు

కార్పొరేటర్లతో కలిసి సికింద్రాబాద్ నుంచి తరలివెళుతున్న ఎమ్మెల్యే పద్మారావు తనయుడు కిషోర్‌గౌడ్

బీఆర్ఎస్ యువజన విభాగం గ్రేటర్ అధ్యక్షుడు ఆలకుంట హరి ఆధ్వర్యంలో తార్నాక నుంచి బయల్దేరిన బీఆర్ఎస్ శ్రేణులు

అమీర్‌పేట్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.హనుమంతరావు, సంతోష్ మణికుమార్ నేతృత్వంలో తరలిన బీఆర్ఎస్ నాయకులు - అమీర్‌పేట్

సికింద్రాబాద్ జోన్ బృందం, నవంబర్ 29: సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ పిలుపు మేరకు దీక్షా దివస్‌కు బీఆర్ఎస్ శ్రేణులు చిలకలగూడ మున్సిపల్ గ్రౌండ్ నుంచి భారీ బైక్‌ర్యాలీగా తరలివెళ్లారు. ర్యాలీని పార్టీ యువ నేత తీగుల్ల కిషోర్‌కుమార్ గౌడ్, కార్పొరేటర్లు హేమ, శైలజ, ప్రసన్నలక్ష్మి, సునీత, యువజన విభాగం అధ్యక్షుడు హరి, నాయకులు నారాయణ, రాజు, శ్రీనివాస్, సునీల్, రాజసుందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గులాబీ జండాలు రెపరెపలాడాయి. జై కేసీఆర్, జైజై కేసీఆర్, జై పజ్జన్న అంటూ పెద్ద ఎత్తున నినదించారు. వేలాది వాహనాలు తరలిరావడంతో రహదారులన్నీ గులాబీ మయంగా మారాయి. బసవతారకం ఆసుపత్రి కూడలి వద్ద ర్యాలీకి ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ఘన స్వాగతం పలికారు. పార్టీ యువజన విభాగం గ్రేటర్ అధ్యక్షుడు ఆలకుంట హరి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీగా తరలివెళ్లారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల వేదికగా దీక్షా దివస్ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ నేత గెల్లు శ్రీనివాస్‌యాదవ్ హాజరయ్యారు. సభాధ్యక్షత బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ తుంగ బాలు వహించారు. వారు మాట్లాడుతూ కేసీఆర్ చేపట్టిన దీక్షా దివస్ ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజని అన్నారు. ప్రపంచంలో ఒక ఉద్యమాన్ని గాంధీ, నెల్సన్ మండేలా తర్వాత అంత శాంతియుతంగా ఉద్యమానిన ఎట్లా నడిపించాలో తెలియజేసిన మనిషి కేసీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు తొట్ల స్వామి, కడారి స్వామి, కోతి విజయ్, శిగ వెంకటేశ్, బూరుగు నవీన్, గాధరాజు చందు, కిరణ్‌గౌడ్, పెద్దమ్మ రమేశ్, క్రాంతి, మధు, జంగయ్య, రాజేశ్‌నాయక్, మిథున్, జీడీ అనిల్, కొంపెల్లి నరేశ్ తదితరులు పాల్గొన్నారు. అడ్డగుట్ట డివిజన్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీగా ర్యాలీలో పాల్గొన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్

అడ్డగుట్ట నుంచి భారీ ర్యాలీగా తరలివెళ్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు

ప్రాణమే ఫణంగా పెట్టిన యోధుడు కేసీఆర్

ర్యాలీలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ, నాయకులు

చిక్కడపల్లి, నవంబర్ 29: తన ప్రాణమే ఫణంగా పెట్టి తెలంగాణ సాధించిన యోధుడు కేసీఆర్ అని యువ నాయకుడు ముఠా జయసింహ అన్నారు. శుక్రవారం దీక్ష దివస్‌కు గాంధీనగర్‌లోని పార్టీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తెగువ చూపి తెలంగాణ సాధించిన వీరుడిగా కేసీఆర్ చరిత్రలో నిలిచారని అన్నారు. గాంధీనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముఠా నరేశ్, నాయకులు బీఎన్ శ్రీనివాస్‌యాదవ్, పున్న సత్యనారాయణ, శ్రీనివాస్‌గుప్తా, శ్రీకాంత్, పాశం రవి, రవి శంకర్‌గుప్తా, కుమారస్వామి, ఆనంద్, నవీన్, ఎస్టీ ప్రేమ్, దేవయ్య, జీవై గిరి, కిరణ్, వెంకటేశ్, రాజ్‌కుమార్, చందు పాల్గొన్నారు.

సూర్య చంద్రులు ఉన్నంత కాలం కేసీఆర్ చరిత్ర



కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర, పులిగారి గోవర్ధన్‌రెడ్డి

చిక్కడపల్లి, నవంబర్ 29: ప్రాణమే ఫణంగా పెట్టి కేసీఆర్ తెలంగాణ సాధించారని, సూర్య చంద్రులు ఉన్నంత కాలం ఆయన చరిత్ర ఉంటుందని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర, పంచాయితీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యుడు పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో దీక్షా దివస్ నిర్వహించారు. ఉపేంద్ర, గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటుకు నవంబర్ 29 పునాది రాయి అని అన్నారు. కేసీఆర్ దీక్షతో సబ్బండ వర్గాలు ఉద్యమంలో పాల్గొన్నారని వివరించారు. ఉద్యమ తీవ్రతకు 2009 డిసెంబర్ 9న ప్రత్యేక రాష్ట్ర ప్రకటన వెలువడిందని అన్నారు. కేసీఆర్ పోరాట స్ఫూర్తి దేశంలో అనేక ఉద్యమాలకు ఊపిరిగా మారిందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కె.గోవర్ధన్‌రెడ్డి, రవికుమార్, సదానందం, రామచంద్రరావు, మంత్రి రవీంద్ర రావు, సత్యనారాయణరెడ్డి, నరసింహాచారి, పవన్, భిక్షమయ్య పాల్గొన్నారు.

బస్సులు తగ్గించడం ప్రభుత్వ కుట్రే

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ముషీరాబాద్, నవంబర్ 29: మహిళలకు ఉచిత బస్ ప్రయాణం ప్రకటించి రాష్ట్రవ్యాప్తంగా 3 వేల బస్సు తగ్గించడం ప్రభుత్వ కుట్రపూరిత చర్య అని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ డిసెంబర్ 4న బస్సు డిపోల ఎదుట, 9న ఆర్టీసీ బస్ భవన్ ముందు ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. శుక్రవారం విద్యానగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అదనపు బస్సులు పెంచాల్సిన సమయంలో తగ్గించడం వల్ల బస్సుల్లో అందోళన, గందగోళం జరుగుతుందని, బస్సులు స్టాప్‌లో ఆగక ప్రయాణికులు సతమతమవుతారని అన్నారు. బస్సుల సంఖ్య పెంచి ప్రయాణికులకు తగిన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వసతి గృహాల్లో, గురుకుల హాస్టల్స్‌లో పుడి పాయిజనింగ్‌పై సమగ్ర విచారణ జరపాలని కోరారు. హాస్టల్ విద్యార్థుల ఆత్మహత్యల వెనుక ఫుడ్ పాయిజనింగ్ తో పాటు ఇతర బయటకు చెప్పుకోలేని కారణాలు ఉన్నాయని ఆరోపించారు. జరిగిన తప్పిదాలపై ఉన్నత స్థాయి విచారణ, లేదా జ్యుడిషయల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ సెక్రటేరియట్ సభ్యులు కె.సూర్యం, ఎం.హన్మేష్, సీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు కె.స్వరూప, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కెఎస్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

చిక్కడపల్లి: మహిళాలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. పట్టణ పేరదిక నిర్మూలనా సంస్థ, హైదరాబాద్ మహానగర్ పాలక సంస్థ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ డివిజన్‌లోని బాపూనగర్‌లో క్యాంటిన్, క్యాటరింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆర్థిక స్వాలంబనతోనే మహిళా సాధికారత సాధ్యం అన్నారు. డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మోహియుద్దీన్, డీపీఓ సుధాకర్ రావు, బీఆర్ఎస్ మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా పడిపూజ

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ ఉదయ్‌నగర్‌లో అయ్యప్ప మహాపడి పూజా కన్నుల పండువగా జరిగింది. చొక్కారపు రఘురాములుగుప్త, శ్రీకాంత్‌గుప్త, రజనీకాంత్ ఆధ్వర్యంలో పూజ మహోత్సవం జరిగింది. రాంనగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయండి'

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 29: రాష్ట్రంలోని పాఠశాలలు, హాస్టళ్లలో జరుగుతున్న ఫుడ్ పాయిజనింగ్, సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈనెల 30న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ప్రభుత్వ పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడు లెనిన్ పిలుపునిచ్చారు. బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. లెనిన్ మాట్లాడుతూ విద్యారంగాన్ని పరిరక్షిస్తామని ప్రగల్భాలు పలికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో ఫుడ్ పాయిజనింగ్ జరిగినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా స్పందించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, హాస్టళ్లలో కనీస సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో విద్యార్థి సంఘాలన్నింటితో కలిసి పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆంజనేయులు, అశ్వన్, ప్రసాద్, రాకేశ్, శ్రీనాథ్, వరప్రసాద్, సుధాకర్, నరేశ్, మధు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి, నవంబర్ 29: ఇందిరాపార్క్ వద్ద బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కల్వ గోపి ఆధ్వర్యంలో దీక్షా దివస్ సంబురాలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి హాజరై కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ నాయకులు రేశం మల్లేశ్, నేత శ్రీనివాస్, సిరిగిరి శ్యామ్, సిరిగిరి కిరణ్, కార్తీక్‌యాదవ్, విఠల్‌రావు, మధు, శివ పాల్గొన్నారు.